## క్లుప్తంగా

### నేడు ఎల్మినేడుకు ఎమ్మెల్యే

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో నేడు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 9:30 గంటలకు గ్రామంలో రూ.3.80కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలతో పాటు ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని మండల పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఇంద్రాసేనారెడ్డి కోరారు.

### గెలుపే లక్ష్యం కావాలి

- పోటీతత్వంతో కష్టపడాలి
- ఎంపీపీ సుకన్య



మహిళలకు బహుమతులు అందజేస్తున్న సుకన్య తదితరులు

**యాచారం:** ఏ అవకాశం వచ్చినా గెలుపే లక్ష్యంగా యువతి, యువకులు పోటీతత్వంతో కష్టపడాలని ఎంపీపీ సుకన్య పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరా యూత్ ఆధ్వర్యంలో ముస్లిం యువకుడు సాహెద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో కష్టపడితే ఏ అవకాశమైనా దక్కుతుందని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజునాయక్, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు నాగరాజు, దయాకర్, గ్రామస్తులు కొంగళ్ల జోగిరెడ్డి పాల్గొన్నారు.

### పండుగ ప్రశాంతంగా జరుపుకోండి

ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్

**కడ్తాల్:** ప్రశాంత వాతావరణంలో మిలాద్ ఉన్ నబి వేడుకలను నిర్వహించుకోవాలని ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ సూచించారు. వేడుకలను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ముస్లిం మత పెద్దలు, నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని, ఎలాంటి సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా జహీరుద్దీన్, నాయకులు జహంగీర్‌అలీ, జానీమియా, ఆసీఫ్‌అలీ, ఇర్షాద్ తదితరులు ఉన్నారు.

### 'గోలి'కి సన్మానం



శ్రీనివాసురెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**తలకొండపల్లి:** రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసురెడ్డిని ఘనంగా సన్మానించారు. ఇటీవల శ్రీనివాసురెడ్డి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం శాలువాలతో సన్మానించి, పుష్ప గుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సుభాష్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, నాగులునాయక్, క్యాబా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్‌గా వినోద్‌కుమార్

**ఇబ్రహీంపట్నం రూరల్:** కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం మండలం ఓబీసీ చైర్మన్‌గా వినోద్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ఈ బాధ్యత అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

**ఇబ్రహీంపట్నం:** క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని తహసీల్దార్ ఎండీ అన్వర్ విద్యార్థులకు సూచించారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్థానిక వైఎల్‌ఆర్ గార్డెన్‌లో ఫ్రెషర్స్ డే ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం శ్రమించాలన్నారు.

### రైతు కుటుంబాలకు అండగా ఉంటాం

**అబ్దుల్లాపూర్‌మెట్:** ప్రతి రైతు కుటుంబానికి అండగా ఉంటామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తారమతిపేటకు చెందిన సంఘం భిక్షపతి కుటుంబానికి సోమవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్‌గౌడ్, డైరెక్టర్లు భరత్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.

# దారులా.. డంపింగ్ యార్డులా?

- పేరుకుపోయిన చెత్తా చెదారం
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఆందోళనలో ప్రజలు
- సమస్య పరిష్కరించాలని డిమాండ్



ఇబ్రహీంపట్నం బైపాస్ రోడ్డు పక్కనే డంప్ చేసిన చెత్త

**ఇబ్రహీంపట్నం:** 'పట్నం' అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతోందని, స్వచ్ఛభారత్‌లో ర్యాంక్‌లు వస్తున్నాయని నేతలు, అధికారులు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. పల్లెల పరిస్థితి ఏమోగాని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిస్థితి దారుణంగా తయారైంది. బైపాస్ రోడ్డుపై వదిలేసిన వ్యర్థాలతో చుట్టుపక్కల కాలనీలు కంపుకొడుతున్నాయి. రుచి దాబా, భారత్‌గార్డెన్, సంగమేశ్వర ఆలయం వరకు చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలకు నిలయంగా మారింది. కృష్ణా జలాల పైప్‌లైన్ లీకేజీ, రోడ్డు వెంట పారే మురికి నీరుతో దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు బెడద, దుర్వాసనతో బైపాస్ రోడ్డు పరిసరాల్లోని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ దారిలో వెళ్లాలంటేనే ముక్కుమూసుకోవాల్సిందే. కంపుకొడుతున్నా మున్సిపాలిటీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని వివిధ ఫంక్షన్ హాళ్లు, చికెన్, మటన్ దుకాణాల, హోటళ్ల వ్యర్థ పదార్థాలతో పాటు, కాలనీవాసులు ఇళ్లలోని చెత్తా చెదారాన్ని ఇక్కడే పడేస్తున్నారు. పరిసర కాలనీల్లో సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీరంతా ఈ రోడ్డు వెంట ప్రవహిస్తోంది. ఫలితంగా స్థానికులను సీజనల్ వ్యాధులు వెంటాడుతున్నాయి.

#### నిర్లక్ష్యం విడాలి



వ్యర్థ పదార్థాలను ఇష్టానుసారంగా పడేయకుండా చూడాలి. చెత్తా చెదారాన్ని పడేస్తున్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి. శుభ్రం చేయడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం విడాలి.

– రమేశ్‌గౌడ్, ఇబ్రహీంపట్నం

#### చర్యలు తీసుకోవాలి



బైపాస్ రోడ్డుపై పలు కాలనీల్లో చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలను పడేస్తున్నా మున్సిపల్ సిబ్బంది ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వ్యర్థాలను తొలగిచడంలో అధికారులు విఫలమవుతున్నారు. మున్సిపల్ యంత్రాంగానికి రోడ్డుపై ఉన్న చెత్తా చెదారం ఎందుకు కనిపించడంలేదు.

– కృష్ణ, ఇబ్రహీంపట్నం

# అభివృద్ధిలో ఆదర్శం తెలంగాణ

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

- విపక్షాలను ప్రజలు విశ్వసించడం లేదు
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**తలకొండపల్లి:** అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలించిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద వేస్తోందని, పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు పోతోందన్నారు. సోమవారం జైపాల్‌యాదవ్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. ప్రతి పక్షాలను ప్రజలు విశ్వసించడం ఎద్దేవాచేశారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ సర్కార్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, ఎంపీపీ నిర్మల, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, వెంకటయ్య, శివశంకర్‌రెడ్డి, రాజు, అలివేలమ్మ, ఎల్లమ్మ, రమేశ్, ఎంపీటీసీలు సుధాకర్‌రెడ్డి, అంబాజీ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, యువజన మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జైపాల్‌యాదవ్ తదితరులు

# 'ఉపాధి' సామాజిక తనిఖీ ప్రజావేదిక

**కడ్తాల్:** కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం రెండో విడుత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. సెప్టెంబర్ 2021 నుంచి, 2023 మార్చి 31 వరకు 24 గ్రామ పంచాయతీల్లో జరిగిన రూ.3,69,34,845 సంబంధించిన ఉపాధిహామీ పనులపై క్షేత్ర స్థాయిలో అధికారులు తనిఖీ చేసిన వివరాలు సభలో వెల్లడించారు. పంచాయతీల వారిగా డీఆర్‌పీలు వెల్లడించిన వివరాలను జిల్లా అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధిహామీలో బడ్జెట్ ప్రకారం కార్మికులకు పని కల్పించాలని సూచించారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించాలన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ నీరజ, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, సమన్వయ కర్త సునీత, ఏపీడీ సక్రియా, డీపీవో కొండయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో లలిత, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

# ఆశ వర్కర్ల సమ్మె సైరన్

**ఇబ్రహీంపట్నం:** ఆశ వర్కర్ల సమ్మె సోమవారం ప్రారంభమైంది. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలుగా కేవలం పారితోషికాలతో పనిచేస్తున్న తమకు రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టీబీ, లెప్రసి, కంటి వెలుగు తదితర బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు:** న్యాయం చేయాలని కోరుతూ ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మెకు సీఐటీయు జిల్లా నాయకుడు కురుమయ్య సంఘీభావం ప్రకటించారు. ఆశ వర్కర్లకు ఇస్తున్న పారితోషికాన్ని రూ.18 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**మంచాలలో నిరసన**

**మంచాల:** మంచాల మండల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అటు అంగన్‌వాడీ వర్కర్లు, ఇటు ఆశ వర్కర్లు సోమవారం వేరు వేరుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అన్ని రకాల ప్రభుత్వ అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కడ్తాల్:** ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఇబ్రహీంపట్నంలో సమ్మె చేస్తున్న ఆశ వర్కర్లు

**ఆశ, అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు**

**యాచారం:** న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు చేస్తున్న సమ్మెలకు సోమవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రం అని చెప్పుకునే తెలంగాణలో ఆశ వర్కర్లకు, అంగన్‌వాడీ సిబ్బందికి, మధ్యాహ్న భోజన సిబ్బంది సమస్యలు పరిష్కరించే విషయంలో నిధులు లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. సమ్మెలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందునాయక్‌లు పాల్గొన్నారు.

# పేదలకు కాంగ్రెస్ అండ

- రాష్ట్రంలో అధికారం మాదే
- చల్లా వంశీచంద్‌రెడ్డి
- ప్రచారపర్వంలోకి నేతలు

**కడ్తాల్:** కాంగ్రెస్ జెండా పేదలకు అండగా ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం మండలంలోని న్యామతాపూర్ గ్రామంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ తుక్కుగూడ విజయభేరి సభ వేదికగా సోనియాగాంధీ నేతృత్వంలో ఆరు గ్యారంటీ స్కీములను ప్రకటించారని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2500, రూ.500కు గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతుభరోసా కింద రైతులకు ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయకూలీలకు రూ.12వేలు, వరిపంటకు రూ.500బోనస్, గృహజ్యోతి పథకం కింద ప్రతీ కుటుంబానికి 200యూనిట్లు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లులేని వారికి ఇంటిస్థలం, రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి సహాయం, తెలంగాణ ఉద్యమ కారులకు 250గజాల ఇంటిస్థలం, యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5లక్షలు, విద్యాభరోసా కార్డు, ప్రతీ మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్లు, చేయూత కింద నెలకు రూ.4వేల పెన్షన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా రూ.10లక్షలు అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అసమర్థ పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పార్టీ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్‌లు విఠలయ్యగౌడ్, బాలరాజ్, హీరాసింగ్, జవహర్‌లాల్, రాంరెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌ను ఆదరించండి**

**తలకొండపల్లి:** కాంగ్రెస్‌కు ఓటు వేసి ఆదరించాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఐక్యమత్యంతో కల్వకుర్తిలో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలన్నారు. సోమవారం మండల పరిధిలోని చంద్రధనలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



న్యామతాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వంశీచంద్‌రెడ్డి

**గుణపాఠం తప్పదు**

**ఆమనగల్లు:** కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికలలో గుణపాఠం చెప్పాలని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో వంశీచంద్‌రెడ్డి పర్యటించారు.

### దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి

**యాచారం:** యాచారంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ నేడు బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉందంటే పండిట్ దిన్ దయాల్ పుణ్యమేనని అన్నారు. నాయకులు రమేశ్, శాంతికుమార్, విజయకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, శ్రీనాథ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### యువతకు అన్యాయం

**తలకొండపల్లి:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పాండు డిమాండ్ సీఎం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష రద్దు చేసినందుకు నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

# గెలుపు మాదే

- కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం
- సర్వేలతో బీఆర్‌ఎస్‌లో ఆందోళన
- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**యాచారం:** ఎన్నికలెప్పుడు వచ్చినా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నల్లవెల్లి గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యురాలు లక్ష్మితో పాటు పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సర్వేలతో బీఆర్‌ఎస్‌లో ఆందోళన పట్టుకుందని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు అమలు కానీ హామీలతో గెలువాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనువాస్‌రెడ్డి, నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గులాం అక్బర్, నాయకులు జంగయ్య, నవనీత, బుచ్చయ్య, వెంకటేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.



రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న లక్ష్మి తదితరులు

# మధ్యాహ్న భోజన సిబ్బంది సమ్మె నోటీసు

**యాచారం:** సకాలంలో బిల్లులు అందలేదని ఏళ్లు, నెలలుగా భారీ మొత్తంలో బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో పడరాని పాట్లు పడుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28 నుంచి సెమ్మెకు దిగుతున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు ప్రకటించారు. ఈ మేరకు సమ్మె నోటీసును సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలోని సిబ్బందికి అందజేశారు. నెలకు రూ.3 వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించాలని, ప్రతి నెలా బిల్లులు అందజేయాలని డిమాండ్ చేశారు. . అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నరేందర్, పద్మ, జంగమ్మ, సువర్ణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బంది

# నమో.. గణనాథ

విఘ్నాలు తొలగించే వినాయకుడిని ఊరూరా భక్తులు ప్రతిష్ఠించుకున్నారు. దేశ, విదేశాల్లో వినాయక చవితిని ఘనంగా జరుపుకొంటున్నారు. స్వామికి పలు రకాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు పండాలని వేడుకుంటున్నారు. మండపాల వద్ద సాయంత్రం వేళల్లో కోలాహలం నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గణేశుడిని నిమజ్జనానికి తరలించారు.



ఆస్ట్రేలియాలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రవాస భారతీయులు



కడ్తాల్: మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బద్నాపూర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు



ఆమనగల్లు: వినాయకుడి పూజలో మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి



ఇబ్రహీంపట్నంలో...



ఆమనగల్లులో..

# విద్యా రంగ సమస్యలపై పోరాటం

**మంచాల:** విద్యారంగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్ అన్నారు. సోమవారం మంచాలలో ఎస్‌ఎఫ్‌ఐ మండల స్థాయి మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న రూ. 5,117 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా 'మేరీ మిట్టీ- మేరా దేశ్'

**కడ్తాల్:** 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం 'మేరీ మిట్టీ – మేరా దేశ్' కార్యక్రమాన్ని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి, భవిష్యత్తు కోసం ఎంతో ధైర్యంగా తమ జీవితాలను అంకితం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువతపైనే ఆధారపడి ఉందని గుర్తు చేశారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, ఏపీడీ సక్రియా, ఏపీఎం రాజేశ్వరి, ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు మల్లయ్య, శ్రీను ఉన్నారు.